క్లుప్తంగా

శేష వాహనంపై శ్రీరంగనాథుడు



శేష వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం శ్రీరంగనాథుడు శేష వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 రోజుల పాటు నిర్వహించే నూలు పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

సింహాద్రిపురం : ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను జడ్పీహెచ్ఎస్ గురిజాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహిస్తున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ పీడీ విక్టర్ తెలిపారు. అండర్ 14, 17 విభాగాలలో బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని పాఠశాలల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల పీడీ, పీఈటీలు అర్హత గల క్రీడాకారుల జాబితాను తప్పక తీసుకురావాలని ఆయన తెలిపారు.

పరామర్శ

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సూరి రెండు రోజుల క్రితం వైఎస్ భాస్కర్‌రెడ్డిని కలిసేందుకు బస్సులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బస్సులో ఇనుపచువ్వలు తగలడంతో చికిత్స కోసం పులివెందుల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వేముల జడ్పీటీసీ బయపురెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధరరెడ్డిలు ఆసుపత్రికి వచ్చి సూరీని పరామర్శించారు.

స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎర్రగుంట్ల : పట్టణంలోని జీవన్‌జ్యోతి హైస్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సమితి కార్యాయలంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నైపుణ్యంలేని డ్రైవర్లను తక్కువ జీతాలతో పెట్టుకుని స్కూల్‌ను నడుపుతున్నారన్నారు. మంగళవారం కదిరివారిపల్లె గ్రామ క్రాస్ రోడ్డు వద్ద స్కూల్ వ్యాన్ ఓ వ్యక్తిని ఢీ కొందన్నారు. గాయపడిన వ్యక్తికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేకపోతే సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

పోషణ అభియాన్‌పై అవగాహన

లింగాల : పోషణ అభియాన్ మాసవ ఉత్సవ్ కార్యక్రమంలో గర్భిణులకు, చిన్నపిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం పార్నపల్లి సచివాలయం పరిధిలోని గర్భిణులకు, పిల్లలను సమావేశపరిచి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పార్నపల్లి అంగన్‌వాడీ సెంటర్-2లో ఆకర్షణీయమైన ముగ్గులు, పౌష్టికాహారాన్ని ఉంచి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

తొండూరు : మండలంలోని భద్రంపల్లె, తొండూరు గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త భగవతీప్రియా బుధవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మండల వ్యవసాయ అధికారి మధుసూధన్‌రెడ్డితో కలిసి రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను ఇ-పంట నమోదు చేసుకుని ఇ-కేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటరు అరెస్టు

ముద్దనూరు : స్థానిక పాతబస్టాండు సమీపంలో బాబా ఫక్రుద్దీన్ అనే మట్కా బీటరును బుధవారం అరెస్టుచేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఇతని వద్ద నుంచి రూ.7310 నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

విధుల నుంచి తొలగింపు

చక్రాయపేట : గండి క్షేత్రంలో పనిచేసే ఉద్యోగి జంపు రెడ్డెయ్యపై విష ప్రయోగం చేసిన వారిని విధుల నుంచి తొలగించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. అన్నదాన సత్రంలో ఇన్‌చార్జిగా ఉన్న జంపు రెడ్డెయ్య ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న నీళ్ల బాటిల్‌లో విషం కలిపిన వంట మనిషి కె.చిన్నరెడ్డెయ్యతో పాటు అతడి వదిన సుజాతను దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించామన్నారు. వీరిపై ఆర్కే వ్యాలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మొక్కజొన్న.. ఆదాయం మిన్న



బి. కొట్టాలపల్లెలో సాగు చేసిన మొక్కజొన్న తోట



వెంకయ్య కాలువలో సాగు చేసిన మొక్కజొన్న పంట

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగుచేస్తే మంచి ఆదాయం వస్తుందని రెండేళ్ల నుంచి రైతులు సాగుమీద మొగ్గుచూపుతున్నారు. మండలంలోని జోగాపురం, లావనూరు, ఏటూరు, వెంకయ్యకాలువ, లింమనేనిపల్లె, బురుజుపల్లె, బి.కొట్టాలపల్లె, బి.కొత్తపల్లె, ఉస్తికాయలపల్లె పలు గ్రామాల్లో బోరుబావుల కింద దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. సాగుకు విత్తనాలు కొనుగోలు, పొలం దుక్కిచేయడం, గింజలునాటడం, కలుపు నివారణచర్యలు, ఎరువులు పురుగుమందులు ఇలా ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుందన్నారు. 90 నుంచి 100 రోజుల మధ్య పంట చేతికి అందుతుంది. వాతావరణం అనుకూలిస్తే 25 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టుబడిపోను రూ.40 వేలు వస్తుంది. దీంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు ఇలా చేయాలి



మొక్కకు మొక్కకు 20 సెంటీమీటర్లు దూరం వరుస వరుసకు 60 సెంటీమీటర్లు దూరం ఉండేలా చూడాలి. ఎక్కువగా కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. దాని నివారణకు మొక్కదశలో కొరాజిన్ 100 మి.లీ వేపనూనె 5 మి.లీ లీటరు నీటికి కలపి పిచికారి చేయాలి. విషపు ఎర ద్వారా కూడా నివారించవచ్చు. కత్తెర పురుగు పొట్టదశలో ఆశిస్తుంది. దీని నివారణకు 10 కిలోల తవుడు 2కిలోల బెల్లం 3 లీటర్లు నీరు పులియబెట్టి చిన్న చిన్న ఉంటలుగా చేసి మొక్క సుడుల్లో వేయాలి. 3జి గుళికలు ఇసుకలో కలిపి వేసినా అరికట్టవచ్చు.

\- ఏ.వి రామంజులరెడ్డి, వ్యవసాయ అధికారి

మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు విత్తనాలు ఎరువు, రసాయనిక మందులు కలిపి పెట్టుబడి రూ.25 వేలు అయింది. వాతావరణం సహకరిస్తే మంచి దిగుబడితో పాటు ఆదాయం మాగానే వస్తుంది.

\- కుడుమల పుల్లయ్య, రైతు, వెంకయ్యకాలువ గ్రామం

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి



మొక్కజొన్న సాగు చేయువిధానంలో మెలకువలు పాటిస్తే మంచిదిగుబడి వస్తుంది. మొక్కజొన్నకు నీటి తడులు బాగా పెడితేనే ఎక్కువ దిగుబడివస్తుంది. కలుపు ఖర్చు, విత్తనాలు, ఎరువులు ఖర్చులు పోను ఎకరాకు రూ.30 నుంచి 40 వేల వరకు ఆధాయం వస్తుంది.

\- జి.శాంతిలింగం, రైతు

రాయితీలు అందాలంటే ఇ-కేవైసీ తప్పనిసరి



వేముల : నల్లచెరువుపల్లెలో ఇ-కేవైసీని పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి



వీఎన్‌పల్లె : ఇ-కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి శ్యామ్‌బాబు

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఇ పంట నమోదు చేయించుకున్న రైతులు ఇ-కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని ఏఓ చెన్నారెడ్డి రైతులకు తెలిపారు. మండలంలోని నల్లచెరువుపల్లె, చాగలేరు రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న ఇ-కేవైసీని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 15,814 ఎకరాల్లో ఇ పంట నమోదు పూర్తి చేశామన్నారు. ఈ రైతులు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 5,250 మంది రైతులు పంట నమోదు చేసుకుంటే ఇందులో 3,618 మంది రైతులు మాత్రమే ఇ-కేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన 1637 మంది సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో ఇన్‌చార్జిలను సంప్రదించి ఈనెల 15 నాటికి ఇ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లో యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు నాగసుధ, లలిత, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు పొందాలంటే పంట నమోదుతో పాటు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం గంగిరెడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ఇ-కేవైసీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 3759 మంది రైతులకు గాను 12972 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. 2824 మంది రైతులకు ఇ-కేవైసీ చేశామన్నారు. ఎవరైనా నమోదు, ఇ-కేవైసీ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో 1067 ఎకరాల్లో కంది పంట సాగు చేశారని ప్రస్తుతం పంట 15 నుంచి 30 రోజుల దశలో ఉందన్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకొనేందుకు ఎకరానికి వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదుకు 15తేదీ వరకు అవకాశం

ముద్దనూరు : ఈనెల 15వ తేదీ నాటికి పంట నమోదు ప్రక్రియ పూర్తవుతుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు రైతుసేవా కేంద్రం సిబ్బందితో పంటను నమోదు చేయించుకోవాలని ఏవో సూచించారు.

వరద బాధితులకు చేయూతను అందించండి

వేంపల్లి : విజయవాడలోని వరద బాధితులకు చేయూతను అందించాలని పట్టణంలోని దుకాణాలలో, ప్రైవేట్ స్కూల్స్, ఆఫీస్‌లలో, వేంపల్లి పట్టణ వీధుల్లో, భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి బ్రహ్మం, సీపీఐ నాయకులు అంజన్నప్పలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విజయవాడ బాధితులకు పట్టణానికి చెందిన మరియా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, బియ్యం సరుకులను సేవా సంఘం సభ్యులు బుధవారం డాక్టర్ ఆగస్టీన్ రాజు ఆధ్వర్యంలో విజయవాడకు ప్రత్యేక వాహనాలలో తరలించారు.

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన



పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి ఉమామహేశ్వరకుమార్

లింగాల : వెలిదండ్ల గ్రామంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమ కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యాధినిరోధక టీకా అధికారి ఉమామహేశ్వరకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాల విషయమై ఆరోగ్య కార్యకర్త నాగజ్యోతికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం లింగాల పీహెచ్‌సీని సందర్శించి అక్కడ టీకా నిల్వల కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మొహినుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సీహెచ్ఓ శివరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రతి మహిళ పెరటి తోటలను పెంచుకోవాలి

పెండ్లిమర్రి : గ్రామాల్లోని ప్రతి మహిళా రైతు తమ ఇంటి వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటలను పెంచుకోవాలని ఆడిషినల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంత కుమారి తెలిపారు. పెండ్లిమర్రి వెలుగు కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై వెలుగు సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్లన కలిగే ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



చెకుముకి పోస్టర్లను విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ఎర్రగుంట్ల : జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను బుధవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జేవీవీ నాయకులు ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధరదేవి మాట్లాడుతూ చెకుముకి పరీక్షలు విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు శాస్త్రీయంగా ఉపయోగపడుతాయన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో 35 ఏళ్ల నుంచి ఈ చెకుముకి పరీక్షలను విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పిల్లలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబర్ 1న మండలస్థాయిలో, అక్టోబరు 27న జిల్లాస్థాయిలో నవంబర్ 9,10వ తేదీలలో రాష్ట్రస్థాయిలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

చిన్నచిన్న సమస్యలకు కోర్టు వరకు వెళ్లకండి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి

లింగాల : గ్రామంలో పరిష్కారమయ్యే చిన్నచిన్న సమస్యలకు కోర్టు వరకు వెళ్లవద్దని అక్కడే పరిష్కరించుకోవాలని పులివెందుల జూనియర్ కోర్టు సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తేర్నాంపల్లెలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రజలకు చట్టాలపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. గ్రామాల్లో పొలాల వద్ద దారులు, గట్లు, చిన్న చిన్న అంశాలకు కోర్టుకు వెళ్లడం జరుగుతోందన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. ఇస్తే తల్లిదండ్రులపై, వాహనదారుడిపై కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో లాయర్లు కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రకాష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు, వీఆర్వో గంగాధరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

పెద్దనపాడులో ప్రభుత్వ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో ఆటోలో అక్రమంగా బియ్యం తరలిస్తుండగా బుధవారం పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వీరభద్రుడు పెద్దనపాడు గ్రామంలో నుంచి సుమారు 500 కిలోలకు పైగానే ప్రభుత్వ బియ్యా న్ని బస్తాలలో వేసుకుని రవాణా చేస్తుండగా సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల పోలీసులు , రెవెన్యూ శాఖ అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు.

జమ్మలమడుగు కేంద్రంగా...

జమ్మలమడుగు కేంద్రంగా అక్రమంగా ప్రభుత్వ బియ్యం రవాణా జరుగుతోంది. జమ్మలమడుగుకు చెందిన ఓ వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తూ ముద్దనూరు, జమ్మలమడుగు ప్రాంతాల నుంచి మహిళలను పెద్ద సంఖ్యలో ఎర్రగుంట్లకు పంపించి ప్రభుత్వ బియ్యాన్ని అక్రమగా రవాణా చేస్తున్నట్లు సమాచారం.

హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం

- ప్రభుత్వ తప్పిదం వల్లే వరదలు
- మృతుల కుటుంబాలకు నష్టపరిహారం వెంటనే అందించాలి
- మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



పులివెందుల రూరల్ : వాతావరణశాఖ హెచ్చరికలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ప్రభుత్వ తప్పిదం వల్ల విజయవాడలో వరదలకు చాలామంది మృతి చెందారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ భారీవర్షాలు, వరదలు వస్తాయని వారం రోజుల క్రితమే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇళ్లు వరదల్లో మునిగిపోకుండా చేసిన ప్రయత్నం వల్లే విజయవాడలోని లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయమయ్యాయన్నారు. వరదనీరు ఇళ్లలోకి వచ్చి ఇళ్లలోని సామగ్రి నీటిలో మునిగిపోయాయన్నారు. వరదలో చిక్కుకున్న కొన్ని ప్రాంతాల్లోని ప్రజలకు కనీస వసతులు సమకూర్చడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. వరద బాధితుల్లో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవాలన్నారు. వరదనీటిలో చిక్కుకున్న ప్రజలకు మెడిసిన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం చూసిచూడనట్లు వ్యవహరిస్తుందే తప్పా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకుని విజయవాడలోని వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న కుటుంబాలకు నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ రిలే దీక్షలు



రిలే దీక్షలను చేస్తున్న ఆర్టీసీ డిపో కార్మికులు

జమ్మలమడుగు : ఆర్టీసీ డిపో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తుందని దీంతో తాము రిలేదీక్షలను చేపట్టినట్లు డిపో అధ్యక్షుడు బ్రహ్మం, రీజనల్ క్యాదర్శి సుధాకర్‌లు తెలిపారు. బుధవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలే దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. రీజనల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలంటూ ఎనిమిది రోజులుగా నిరసనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డిపో మేనేజరు ఏకపక్షంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బస్సులకు నష్టం జరిగిందంటూ కార్మికుల వద్ద నుంచి రికవరీ చేయడం మంచిపద్ధతి కాదన్నారు. డిపో మేనేజర్‌పై వెంటనే చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎంజీసీవోరెడ్డి, శివుడు, వలి, కాంతయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



కమలాపురం : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీలు అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్‌బేగం తెలిపారు. బుధవారం కమలాపురం సెక్టార్‌లోని 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో 1వ వార్డు సచివాలయంకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆకు కూరలు, కూరగాయలు తదితర వాటితో లోగో చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు రాణి, లక్ష్మీదేవి, కిరణ్ కుమారి, గౌసియా, ఎలిజబెత్ రాణి, వైష్ణవి, క్రిష్ణవే ణి, గర్భిణులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పౌష్టిక ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ వసంత తెలిపారు. మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.

కొండాపురం : గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. బుధవారం మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో పోషక వారోత్సవాల్లో భాగంగా బాలింతలు గర్భిణులకు అవగాహన కల్పించారు.

మెడికల్ కళాశాలకు అనుమతులు మంజూరు చేయండి

- సీట్ల మంజూరు కోసం పోరాటం చేస్తాం
- ఆర్డీఓకు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : కడపరోడ్డులో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మినీ సెక్రటేరియట్‌లో ఉన్న ఆర్డీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా వెనుకబడి ఉన్న పులివెందుల ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు పులివెందుల ప్రాంతంలో వైఎస్సార్ మెడికల్ కళాశాలను నిర్మించారు. ఈ ప్రాంత ప్రజలు వైద్య సేవల కోసం హైదరాబాద్, బెంగళూరు, కర్నూలు, తిరుపతి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యం అందించే విధంగా మెడికల్ కళాశాలను నిర్మించారు. కళాశాల ప్రిన్సిపాల్ 150 సీట్లు వైద్య, విద్య అనుమతుల కోసం జాతీయ వైద్య, విద్యామండలిని కోరారు. వారు ప్రవేశాలకు అనుమతులు ఇవ్వడానికి కళాశాలను తనిఖీ చేసి సరిపడు సిబ్బంది లేరన్న సాకుతో 50 సీట్లతో మొదటి సంవత్సరం ప్రవేశాలకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పులివెందుల ప్రాంతంపై కక్షపూరిత వైఖరిని అవలంభించి జాతీయ వైద్య, విద్య మండలి వారికి ఇవ్వాల్సిన అండర్ టేకింగ్ లెటర్‌ను ఇవ్వలేదన్నారు. మొదటి, రెండవ విడత కౌన్సిలింగ్ జాబితాలో కూడా పులివెందుల కళాశాల పేరు లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికై నా ప్రాంతీయ అసమానతలు, పక్షపాత వైఖరిని వీడనాడి పులివెందుల ప్రాంత ప్రజలను, విద్యార్థులను, కళాశాల సిబ్బందిని దృష్టిలో పెట్టుకుని జరుగబోయే మూడవ విడత కౌన్సిలింగ్ జాబితాలోనైనా మెడికల్ కళాశాల పేరు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి కిషోర్, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, కొండయ్య, జగదీశ్వర్‌రెడ్డి, గుల్జార్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, మధుసూదన్‌రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

గండి ఆలయ మాన్యం స్వాధీనంలో జాప్యం ఎందుకో?

చక్రాయపేట : గండి దేవస్థానానికి సంబంధించి ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పంచాయతీలో ఉన్న భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవడంలో జాప్యంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెల 8న చెన్నముక్కపల్లె రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 192-3లో ఉన్న 21 సెంట్ల భూమిని సాక్షి వెలుగులోకి తెచ్చింది. ఈ భూమి విలువ ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్ ధర ప్రకారం రు.15 లక్షలు పైనే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. సదరు ఆర్ఎస్ఆర్‌ను జోడించి జిల్లా కలెక్టర్, ఆర్డీఓతో పాటు ఖాజీపేట తహసీల్దార్‌కు ఆలయ అధికారి లేఖ ఇస్తే అధికారులు స్వామి పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చే అవకాశం ఉంది. అయినా ఎవరూ పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ఈ విషయంపై ఆలయ అధికారి వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా కొన్నిపనుల కారణంగా ఆలస్యం అవుతోందన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



పులివెందుల : నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు



వేంపల్లె : నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు



లింగాల : నిమజ్జనానికి వెళ్తున్న ...



అహోబిలాపురంలో అన్నదాత కొమ్మెర రామచంద్ర

పులివెందుల టౌన్ : పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఐదవ రోజు బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి, వెల్లటూరు, చెర్లోపల్లె, పాతసంగటిపల్లె గ్రామాల్లో బుధవారం ఘనంగా గణనాథుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు.

సింహాద్రిపురం : స్థానిక బస్టాండ్ సెంటర్లోని గణనాథుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. చెక్కభజనలు కోలాటాల నిర్వహించారు.

లింగాల : ఎగువలింగాల, కామసముద్రం, పెద్దకుడాల, మురారిచింతల గ్రామాల్లో నిమజ్జనం సాగింది.

వేంపల్లి : బలిజ సంఘం వీధి, నామాలయ వీధి, వడ్డెర వీధి, పప్పుల బజార్ తదిత ప్రాంతాల్లోని వినాయకుల ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.